
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

March - 2012

సంవత్సర చందా రూ. 50/-

# క్రీస్తు సంఘములు సమర్పించు

# సత్యవాణి టి.వి. ప్రసారములు

ప్రతి ఆదివారం సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త

ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ

ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ

ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన

ఛానల్‌లలో వీక్షించండి.

ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆ కోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును.


మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం. 80,**

**కాకినాడ. ఎ.పి.**

**533 001.**

**ఫోన్ : 0884 - 2363722**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - ౩౨ | మార్చి - ౨౦౧౨ | సంచిక -౮


## క్రీస్తు సంఘము
### (The Church of Christ)

ప్రపంచమందంతటను ఈనాడు అనేక సంఘములు ఉన్నవి. అవన్నియును యేసుక్రీస్తు సంఘములేయని వారు చెప్పుకొనుచూ యుంటారు. వీటిలో ఉన్న ఒక విశేషము ఏమంటే, ఆయా సంఘములవారు ఒక దానికంటె మరియొక దానికి వేరుగాయున్న బోధలను, సిద్ధాంతములను వారు బోధించుతూ, అనుసరిస్తూ యుంటారు. నిజానికి వారి వివిధ బోధలవలన నేడు క్రైస్తవలోకము అంతయును విభజింపబడి యున్నది. ఈలాగున విడిపోయియున్న శాఖలలో ఏది నిజమైన క్రీస్తు సంఘము? ఏది నిజమైన క్రీస్తు శరీరము? అనే ప్రశ్నలు మీకు రావచ్చును.

దేవుడు తన సంఘమును స్థాపించుటకొరకు గొప్ప క్రియలను చేసారు. చివరకు తన కుమారుని సంఘముకొరకు బలిగా అర్పించారు. సర్వమానవుల కొరకు ఆయన ఒకే ఒక్క సంఘమును స్థాపించారు. ఈ సంఘము శాఖోపశాఖ లుగా విడి పోవలెనని ఆయన ఎన్నడును కోరనే లేదు, సరిగదా యేసుక్రీస్తు తన అను

చరులయొక్క ఐక్యతకొరకు ప్రార్థించెను. "తండ్రీ ! నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండ వలెనని వారి కొరకును ప్రార్థించు చున్నాను అని ఆయన ప్రార్థించెను (యోహాను 17:20-21). కొరింథిలో యున్న సంఘ ములో చీలికలు రాగా అపొస్తలుడైన పౌలు వాటిని ఖండించెను : "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, ఏక మనస్సు తోను, ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండ వలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను". క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?" యని అతడు వారి నడిగెను (1కొరింథి 1:10- 13).

యేసుక్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. "నా సంఘమును నేను కట్టుదును" అని ఆయన చెప్పెను. "శరీరము ఒక్కటే" యని వాక్యము చెప్పు చున్నది, ఆ శరీరము సంఘము అనికూడా అది చెప్పుచున్నది. గనుక క్రీస్తుకు ఉన్న సంఘము ఒక్కటే, అయితే ఆ ఒక్కటే సంఘము ఏది? అది ఏమై యున్నది? (మత్త 16:18; ఎఫె 4:4; కొలస్స 1:18).

క్రీస్తు సంఘము ఒక డినామినేషన్‌కాదు. అది అనేక డినామినేషన్ల కలయిక అంతకుముందే కాదు. అది క్రైస్తవ మతశాఖకాదు. అది కేథలిక్కు సంఘము కాదు. ప్రొటెస్టాంట్ సంఘము కూడా కాదు. అది ఒక తెగకాదు. అది ఒక మనుష్యునితో ఆరంభించబడలేదు. దానికి ఒక మానవుడు అధికారిగా లేడు. మానవుల ఆధిపత్యమున అది నడచు కొనదు. అది మనుష్యుల పేరులను అసలే ధరించదు. మనుష్యులు వ్రాసిన ప్రమాణ పుస్తకములను బట్టి అది నడువదు. అది రాజకీయముగా గాని, సాంఘికముగా గాని ఉన్న ఒక సంస్థకాదు; అయితే అదేమిటి? అని మీరడుగవచ్చును. అదే క్రీస్తు సంఘము, అదే బైబిలు సంఘము, అదే నిజ సంఘము.

సంఘము అను పదము 'ఎక్లీషియా' అను గ్రీకు పదము నుండి వచ్చినది. ఎక్లీషియా అనగా పిలువబడినవారు అని అర్థము. గనుక సంఘములో ప్రత్యేకముగా పిలువబడినవారందురు. క్రీస్తు సంఘములో, క్రీస్తు సువార్తద్వారా పిలువబడినవారుంటారు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా

చేసెను" అని అపొస్తలుడైన పౌలు వ్రాసెను (కొలస్స 1:13).

క్రీస్తు సంఘమును స్థాపించెను. "నాసంఘమును నేను కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవు" అని యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 16:18). సంఘమును కట్టిన వాడు ఆయనే గనుక సంఘము ఆయనదే. ప్రభువు తన స్వరక్తమిచ్చి ఈ సంఘమును సంపాదించెను (అపొ.కా. 20:28). గనుక ఏ సంఘమైనను క్రీస్తుద్వారా నిర్మించబడకపోయిన యెడల అది క్రీస్తు సంఘమెట్లు కాగలదు?

సంఘమునకు పునాది యేసుక్రీస్తే: "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసు క్రీస్తే" అని పౌలు వ్రాయుచున్నాడు; (1కొరింధి 3:11). ముఖ్యమైన మూల రాయి కూడా క్రీస్తే. క్రీస్తు యేసే ముఖ్య మైన మూలరాయియై యుండగా అపొ స్తలులును, ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు" అని ఎఫెసులోని క్రీస్తు సంఘమునకు పౌలు వ్రాసెను (ఎఫెసీ 2:20).

క్రీస్తు సంఘము యెరూషలేములో ఆరంభింపబడును అని దేవుడు యెషయా ద్వారా ప్రవచించెను (యెషయా 2:3). అది యెరూషలేములోనే ఆరంభమా యెనని అపొస్తలులకార్యములు 2వ అధ్యాయ ములో మనకు తేటగా కన్పడు చున్నది. నీవు సభ్యత్వము కలిగి యున్న సంఘము ఎక్కడ ఆరంభమా యెను? అది యెరూష లేములో, పెంతెకోస్తు అను పండుగ దినమున కాని యెడల అది క్రీస్తు సంఘము కాదు.

క్రీస్తు సంఘము మొదటి శతాబ్దము లో 33వ సంవత్సరమున యెరూషలేములో స్థాపించబడెను. క్రీస్తే దానిని స్థాపించెను గనుక ఆ సంఘము నీదిగాని, నాదిగాని, మరి యేమానవునిది గాని కాదు. అది ఇంగ్లాండు దేశములో ఆరంభించలేదు. గనుక అది Church of England కాదు. అది అమెరికాలో ఆరంభించలేదు. అందువలన అది ఒక అమెరికా సంఘము కాదు. అది ఇంచుమించు రెండు వేల సంవత్సరముల క్రితమే ఆరంభమాయెను గనుక అది ఒక క్రొత్త సంఘముకాదు.

నిజమైన సంఘము దానిని స్థాపిం చినవాడు క్రీస్తు, దాని శిరస్సు క్రీస్తు , దాని రక్షకుడు క్రీస్తు, దాని పునాది క్రీస్తు ముఖ్యమైన మూలరాయి క్రీస్తు అని క్రొత్త నిబంధన మనకు విపులముగా బోధిం చుచున్నది. సంఘము ఆయన నామమునే ధరించ వలెనుగదా? "క్రీస్తు సంఘములు మీకువందనములు చెప్పుచున్నవి" అని పౌలు రోమా 16:16లో వ్రాసెను. క్రొత్త నిబంధ లోని సంఘము, దేవుని సంఘము (1కొరిం ధి 1:2), సజీవముగల దేవుని

సంఘము (1 తిమోతి 3:15), ప్రభువు సంఘము (అపో.కా. 20:28), క్రీస్తుసంఘము (రోమా 16:16) అని వివరించబడి యున్నది.

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. సంఘము ఆయన యొక్క ఆత్మీయ శరీరమైయున్నది (కొలస్స 1:18). భూసంబంధమైన వ్యక్తి ఎవడును దీనికి భూమిపై అధికారిగా లేడు. "పరలోక మందును, భూమిమీదను నాకు సర్వాఅధి కారమీయబడి యున్నది" అని యేసు చెప్పెను (మత్తయి 28:18). గనుక క్రీస్తు సంఘమునకు భూమిపై ఒక ముఖ్య కేంద్రము (Head Quarter) లేదు.

క్రీస్తు సంఘము మానవులచే వ్రాయబడిన ఒక విశ్వాసప్రమాణ పుస్తకమును (Creed Book) అనుసరించి నడువదు. సంఘ విశ్వాసమునకు, ఆచరణకు అది క్రొత్త నిబంధననుసరించి నడుచును. బైబిలు ఏమి పల్కునో దానినే అది బోధించును. బైబిలు ఎక్కడ మౌని యగునో అక్కడ అది మౌని యగును. "బైబిలు సంగతులను అది బైబిలు పేర్లతో పిలుచును, "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" గనుక అది మానవ కల్పిత గ్రంథముల ననుసరింపదు(2 తిమో 3:17).

క్రీస్తు సంఘ సభ్యులు క్రొత్త నిబంధనలో క్రైస్తవులు అని మాత్రమే పిలువబడుదురు. క్రొత్తని బంధనలో మీరు క్రైస్తవులను గూర్చి చెప్పబడుట చూడగలరు. అంతియొకయలో క్రీస్తు శిష్యులు మొదట క్రైస్తవులనబడిరి అని అపో.కా. 11:26 లో మనము చూడ గలము. అందువలన క్రీస్తుసంఘ సభ్యులు కేవలం క్రైస్తవులు, వారు ప్రొటెస్టాంట్ క్రైస్తవులు కాదు. వారు కేథలిక్కు క్రైస్తవులు కాదు వారు కేథలిక్కు క్రైస్తవులు కాదు. వారు ఒక డినామినేషన్ క్రైస్తవులు అంతకు ముందే కాదు. గాని వారు కేవలం క్రైస్తవులు మాత్రమే. రక రకాలైన క్రైస్తవులనుగూర్చి బైబిలు బోధించుటలేదు.

ప్రపంచమందంతటా వేలకొలది యున్న వ్యక్తి గతసంఘములతో (అంటే డినామినేషన్లతో కాదు) క్రీస్తు సంఘము ఏర్పడి యున్నది. ప్రతి స్థానిక క్రీస్తు సంఘము క్రీస్తునందు స్వతంత్రత కలిగి యున్నది. అయితే ఈ స్థానిక సంఘము లన్నియును ప్రేమచేతను, ఏకాభిప్రాయముచేతను కలిసి బంధింపబడి యున్నవి.

అపొస్తలుల కాలములో ఈ సంఘ సభ్యులగుటకు ఒకే ఒక మార్గము ఉండెను. యేసుక్రీస్తు సువార్తను వినిన వారు దానిని విశ్వసించి, వారి పాపములను గూర్చి మారుమనస్సునొంది,

క్రీస్తును ఒప్పుకొని, వారి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. అట్లు వారు రక్షింప బడినందున సంఘముతో ప్రభువుచే చేర్చబడిరి. నీవుకూడా యేసునందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్ష మాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల, ఈనాడే యేసుక్రీస్తు నిన్ను తన సంఘముతో చేర్చును.

## ఉపదేశకులు, వారి అర్హతలు, బాధ్యతలు
## (Teachers, Their Qualifications and Responsibilities)

నేటిదినాల్లో అనేకులు సత్యమునకు లోబడి క్రీస్తు సంఘ సభ్యులగుచున్నారు. వారిలో ఎక్కువ మంది యువకులే. మరియు వారిలో ఎక్కువ మంది బైబిలు స్కూలు ద్వారా గాని, కరస్పాండెన్సు కోర్సుల ద్వారా గాని సత్యమును తెలిసికొనినవారే. బైబిలు క్లాసులలో నేర్పించబడు దానిని బట్టి సంఘాభివృద్ధి ఎక్కువ ఆధారపడి యున్నది. అంటే యింట చేయబడు బోధనను మనము తక్కువగా అంచనా వేయుట లేదు గాని సంఘము ద్వారా జరిగించబడే ఉపదేశ కార్యక్రమానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చుచున్నామని అర్థము.

చాలా మంది చిన్నపిల్లలు సండేస్కూలుకు వెళ్లి నేర్చుకోలేక పోవుచున్నారు. యిది విచారకము. సంఘము యొక్క భవిష్యత్తు అంతయు నేటి బాల బాలికలపై ఆధారపడి యున్నది. గనుక బాలబాలికలకు సరియైన రీతిగా బైబిలును ఉపదేశించుట చాల ప్రాముఖ్యము. ఈ ఉపదేశ కార్యక్రమాన్ని తక్కువగా అంచనా వేయరాదు.

సంపదగల వారిని క్రీస్తులోకి మార్చగలిగితే చాల సంతోషము. అయితే అట్టి సందర్భములు అరుదు. ఒక ధనవంతుని మార్చుటకంటే వందమంది యువకులకు మనం తేలికగా తర్ఫీదునీయగలము. నేటి బాల బాలికలే రేపటి ప్రతిభావంతులైన పౌరులు. నేడు సంఘాల్లో యున్న ప్రతిభావంతులు తమ యౌవన దశలోనే క్రీస్తులోనికి మార్చబడిన వారు. పురుషులు స్త్రీలు వృద్ధాప్యమునకు

వచ్చువరకు మనము కనిపెట్టరాదు. తమ జీవితాలను ప్రజలు అపవాది పరిచర్యలో పాడుచేయకుండా చూడడమే మన బాధ్యత. వారు నానా వ్యసనాలకు లోనై తమ శరీరములను పాడు చేసికొంటూ యుండే స్థితికి చేరకముందే వారిని మార్చి క్రీస్తులోనికి నడిపించాలి. వారిని క్రీస్తు దరికి చేర్చి మంచి సాధనము లుగా తయారుచేయాలి.

గతంలో బైబిలు క్లాసులకు ప్రాముఖ్యత నిచ్చేవారము కాదు, నిజమే. యిది గొప్ప పొరబాటు. మన కూటములన్నీ సమయానికే ప్రారంభించాలి. మనం నానా అలవాట్లకు లోనైయ్యేవారం గనుక మంచి అలవాట్లను అలవరుచుకోవాలి. సమయానికి హాజరవడం ఒక మంచి లక్షణం.

సాధారణంగా చేయబడే బోధ అంతా పెద్దవారినే ఉద్దేశించియుంటాది. పదిహేను సంవత్సరాల దిగువ వయసు గలవారి కొరకు తగిన పాఠాలు అందించ బడవు. ఉపదేశకులు విద్యార్థులను గూర్చి తగినంత ఆలోచన, సమయం కేటాయించ కపోతే, వారు కూటముల నుండి యేమీ నేర్చుకోలేరు. అందు వలన ఇక్కడ ఉపదేశకులకు కొన్ని సలహాలను పొందు పరచుదాం.

**మంచి ఉపదేశకుడు క్రమము తప్పకుండా హాజరగును:**

యిది చాల ప్రాముఖ్యము. క్లాసులు జరిగే వేళలలో అన్నింటికి ఒకడు హాజరు కాకపోవచ్చును. మనం నూరు శాతం పరిపూర్ణంగా పని చేయలేము. అందువలన ఉపదేశకులు క్రమము తప్పకుండా తమ క్లాసులకు హాజరు కావలెను. ఏ ఉపదేశకుడైనా క్రమాన్ని పాటించకపోతే విద్యార్థుల ఆసక్తిని కొనసాగించలేడు. కొందరు క్రమాన్ని పాటించరు. ఒకవేళ ఉపదేశించువారు హాజరుకాలేకపోతే వారి స్థానములో ముందుగానే ఇంకొకరిని నియమించు కోవలెను. కొన్నిసార్లు విద్యార్థులు సమావేశమౌతారు గాని ఉపదేశకు లుండరు. అయితే సబ్జెక్టు తెలియని వారికి ఆ బాధ్యత అప్పగించి పొరబాటు చేస్తారు. ఈ రీతిగా బైబిలు క్లాసులను గూర్చి ఆసక్తి రేకెత్తించుట అసంభవము. ఉపదేశకులు ఉపదేశించడానికి సిద్ధపడియుండాలి. వారికి ఆసక్తి యున్నట్లు కనబరచాలి. అజాగ్రత్తగా ఈ పని చేయకూడదు.

**మంచి ఉపదేశకుడు పని చేయుటకు కోరికగలవాడు :**

ఎవరూ లేనందున ఉపదేశించుట కుపకరించువాడు ఎక్కువ సాధించలేడు. దేవుని వాక్యాన్ని ఉపదేశించుటకు కష్టపడువాడు ప్రతి కూటమునకు హాజరగును. కొన్ని సార్లు నులివెచ్చని స్థితిలో యున్నవారిని సంతోషపెట్టుటకు

ఉపదేశించు క్లాసులనిస్తారు. సంఘకూటములకు హాజరగుటకు ఆసక్తిలేని వాడు, సత్యమును గూర్చి ఆసక్తిలేని వాడు, అట్టివానిని ఉపదేశకునిగా నియమించరాదు. అట్టివారు మంచి మాదిరులుకారు. వారి ప్రభావము యేమీ బాగుండదు. సత్యమును ప్రేమించు వారు, క్రీస్తు సువార్త వ్యాప్తి కొరకు మండుచున్న కాంక్షకలవారు, దేవుని రాజ్యమునకు ఆత్మలను సంపాదించువారు మనకు ఉపదేశకులుగా కావాలి.

**మంచి ఉపదేశకుడు చక్కగా సిద్ధపడును :**

తాను బోధించే పాఠాన్ని గూర్చి ఉపదేశకుడు కొన్ని వారములనుండే జాగ్రత్తపడాలి. తాను బోధించే అంశముపై వీలైనంత ఎక్కువ సమాచారమునతడు సేకరించాలి. ఒకడు లోకరీత్యా ఎంత విద్యావంతుడైనను అతని బైబిలు జ్ఞానము, తాను చెప్పబోవు అంశమును గూర్చి అతనికున్న జ్ఞానము సంకుచితమైతే విజయాన్ని సాధించలేడు. ఉపదేశకునిగా జయం పొందాలంటే అతడు తగినంత బైబిలు జ్ఞానము కలిగినవాడై యుండాలి.

**మంచి ఉపదేశకుకు ఎల్లవేళలా సమయానికి హాజరగును :**

క్లాసులకు ఆలస్యముగా వచ్చుట చెడు ఉదాహరణయేగాక విద్యార్థులకు నిరాశ కలిగించును. ఉపదేశకుడు రాక ముందు విద్యార్థులు ఏవేవో ఆలోచించుకొంటారు. కొన్ని సంఘాలు ఆరాధనకు ముందు ప్రార్థన కూడిక నిర్వహిస్తారు. అందువలన ప్రజల మనస్సులు ఆత్మీయముగా సిద్ధపరచబడ్తాయి. బైబిలు టీచర్ సరిగా ఉపదేశించకపోతే విద్యార్థులు కొంచెం గందరగోళం సృష్టించ వచ్చును. క్లాసులలో లోకసంబంధమైన సంభాషణ జరుగనియ్య కూడదు. సంఘ సభ్యులందరు క్లాసులకు సకాలమునకు హాజరు కావాలి. ప్రతి క్లాసు భయభక్తులతో నిర్వహించాలి.

**మంచి ఉపదేశకుడు క్రమశిక్షణను పాటించును, కొనసాగించును:**

క్లాసులో ఉన్న పిల్లలు మాటలాడుట మంచిదే, గాని అందరు కలిసి గందరగోళము సృష్టించకూడదు. అందరు లేచి మాట్లాడితే ఎవరేమి చెప్పుచున్నారో తెలియదు. క్లాసు యొక్క విలువలు పాడైపోతాయి. గనుక ఏమైనా ప్రశ్నలు, సందేహాలు వుంటే ఒకరి తరువాత మరియొకరు చెప్పవచ్చును. క్లాసులో క్రమశిక్షణను అమలు పరచలేని ఉపాధ్యాయుడు గౌరవింపబడడు. సంఘపెద్ద వస్తేనే గాని క్లాసులో నిశ్శబ్ధ వాతావరణం రాకపోయినప్పుడు, ఉపదేశకుడు సిగ్గునొందవలసి వచ్చును. ఉపదేశకుడు జయం పొందాలంటే క్లాసు అతనిని గౌరవించాలి. క్లాసు అతనిని గౌరవించాలంటే దానిని అతడు కంట్రోలు చేయాలి.

**మంచి ఉపదేశకుడు సహించును:**

చాలమంది బాలబాలికలకు విధే

యత అంటే యేమిటో తెలియదు. వారి తల్లిదండ్రులు గాని, వేరొకరుగాని వారిని అదుపులో పెట్టలేదు. అట్టివారి విషయంలో ఉపదేశకుడు కొంత సహనము ప్రదర్శించాలి. ఎవరైనా ప్రశ్న అడిగితే అతనిని నిర్లక్ష్యము చేయకూడదు. వేయబడిన ప్రశ్న ఎంత స్వల్పమైనదైనాదానికి జవాబీయాలి. ప్రశ్నకు జవాబు తెలియకపోతే ఉపదేశకుడు తెలిసినట్టు నటించి డొంకతిరుగుడు జవాబీయకూడదు. జవాబు తెలియకపోతే "నాకు తెలియదు" అని చెప్పుటకు సిగ్గుపడకూడదు. అయితే విద్యార్థులలో ఎవరైనా జవాబు చెబితే ఉపదేశకుడు సిగ్గుపడనవసరంలేదు. జవాబు ఎవరికీ తెలియకపోతే, తదుపరి క్లాసులో తెలిసికొని చెబుతానని విద్యార్థులకు తెలియజేయాలి.

**మంచి ఉపదేశకుడు దయ కలిగి యుండును:**

దయచూపించుట అంటే ఎవరి మీదనో జాలి చూపిస్తున్నామని, దు:ఖిస్తున్నామని అర్థము కాదు, గాని ఒక వ్యక్తి యున్న స్థితిని మన గ్రహించుకొన్నామని, అతని భావాలతో ఏకీభవించు చున్నామని అర్థము. ఉపదేశకుడు తన క్లాసులోయున్నవారందరి గృహాలను దర్శించాలి.ప్రతివాని యొక్క వాతావరణమును ఎరిగి యుంటే ఉపదేశకుడు వారికి తగురీతిగా బోధించగలడు, సహాయపడగలడు.

**ఉపదేశకుడు మంచి వ్యక్తిత్వము కలిగి యుండాలి:**

వ్యక్తిత్వము అనుమాట అందరు ఎరిగినదే, దాన్ని నిర్వచించడం కష్టం. ఒక వ్యక్తి నుండి వేరొక వ్యక్తిని వేరుపరచు లక్షణాలను మనం వ్యక్తిత్వము (Personality) అని చెప్పుకోవచ్చును. అతని ముఖవర్ఛస్సు వెంద్రుకలు, కళ్లు, దుస్తులు, వయస్సు, నడక నిజానికి అతని గూర్చినవన్నీ అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి. మంచి ఉపదేశకుడు వీటన్నిటి మొత్తమును సమపాళ్లలో కలిగియుండి తన వైపు ప్రజలను ఆకర్షించుకొనును. మంచి వ్యక్తిత్వము గలవారిగా విద్యార్థులను తయారు చేయుటలో ఉపదేశకుడు గొప్పసహాయకారికాగలడు. బలహీన వ్యక్తిత్వము గలవాడు మంచి ఉపదేశకుడు కాజాలడు. నీవు బైబిలు టీచర్‌వు అయినట్లయితే పైన చెప్పిన వాటిని ధ్యానించి, మంచి ఉపదేశకునిగా తయారు కమ్ము. నీపై ఎంతో ఆధారపడి యున్నది. బాల బాలికల జీవితాలు నీపై ఆధారపడి యున్నాయి. క్రీస్తుకొరకు, నిత్యత్వం కొరకు వీరందరిని సరిదిద్దుటకు నీకున్న శక్తినంతా వినియోగించుము.

-ఎల్. ఆర్. విల్సన్.

స్త్రీల విభాగము:

## యోబు భార్య సాతాను పరికరము
## (Mrs. Job, a tool of satan )

యోబు భార్యను గూర్చి యోబు గ్రంథము రెండవ అధ్యాయము వరకు చెప్పబడకపోయినను, మొదటి అధ్యాయము నుండియే కొంత సమాచారాన్ని సేకరింతము. యోబు భార్యను గూర్చి తెలిసికోవాలంటే ఆమె చుట్టు యున్న వారిని గూర్చి కూడ తెలిసికోవాలి.

యోబు యదార్థవర్తనుడును, న్యాయవంతుడునై దేవుని యందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు (యోబు 1:1). అతనికి ఏడుగురు కుమారులును ముగ్గురు కుమార్తెలును కలిగిరి. అతడు ఏడు వేల గొర్రెలును మూడువేల ఒంటెలను ఐదు వందల జతల ఎడ్లను, ఐదు వందల ఆడుగాడిదలును, బహు మంది పని వారును కలిగి బహు ఆస్థిపరుడై యుండెను (యోబు 1:3).

యోబు వంటి భక్తిగల వాడు భూమి మీద ఎవడును లేడని దేవుడు చెబితే, "యోబు ఊరకనే దేవుని యందు భయభక్తులు కలవాడాయెనా? నీవు అతనికిని అతని యింటివారికిని అతనికి కలిగిన సమస్తమునకు చుట్టు కంచె వేసితివి గదా? నీవు అతని చేతి పనిని దీవించుట చేత అతని ఆస్థి దేశములో బహుగా విస్తరించియున్నది. అయినను నీవు ఇప్పుడు నీ చేయిచాపి అతనికి కలిగిన సమస్తమును మొత్తిన యెడల అతడు నీముఖము ఎదుటనే దూషించి నిన్ను విడిచి పోవునని" సాతాను యెహోవాతో అనెను. ఇట్టి పరీక్షలో యోబు విజయంసాధిస్తాడని ఎరిగినవాడై దేవుడు వాని సవాలును స్వీకరించెను. యోబును శోధించుటకు ఆయన అపవాదికి అనుమతియిచ్చెను. వాడు అతని ప్రాణమునకు ఏమాత్రము హాని చేయ్యరాదు.

**యోబు 1:8-12.**

ఒకదినమున యోబు తన కుటుంబీకులతో కలిసి భోజనము చేయుచుండగా వర్తమానికుడొకడు వచ్చి అతని ఎడ్లు, గాడిదలు షెబాయీయులు ఎత్తుకొనిపోయి అతని పనివారిని చంపిరని చెప్పెను. మరి యొకడువచ్చి ఆకాశమునుండి అగ్నివచ్చి తనపనివారిని, గొర్రెలను తగుల బెట్టెనని చెప్పెను. అతడింక మాటలాడు చుండగా కల్దీయులు వచ్చి ఖడ్గము చేత అతని పని వారిని చంపి ఒంటెలను ఎత్తుకొనిపోయిరని చెప్పెను. అతడీమాటలు చెప్పుచుండగా మరి యొకడు వచ్చి యోబు యొక్క కుమారులు, కుమార్తెలు అందరు సుడిగాలిలో నాశనమైరియని వర్తమానము చెప్పెను

(యోబు 1:14–19).

ఇట్టివిపత్తు సంభవించుచుండగా అపవాది తలంచినవిధముగా యోబు ప్రవర్తింపలేదు. "అప్పుడు యోబులేచి తనపై వస్త్రమును చింపుకొని తలవెంట్రుకలు గొరిగించుకొని నేల మీద పడి సాష్టాంగ నమస్కారము చేసి యిట్లనెను: నేను నాతల్లి గర్భములో నుండి దిగంబరినైవచ్చితిని, దిగంబరినై అక్కడకి తిరిగి వెళ్లెదను; యెహోవా యిచ్చెను, యెహోవా తీసికొనిపోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక" యనెను (యోబు 1;20,21). యోబు సమస్తమును కోల్పోయినను ఈ సంగతుల లో ఏ విషయమందును అతడు దేవుని నిందించలేదు. అయినను సాతాను అతని విడిచి పెట్టలేదు. వాడు దేవునితో, "చర్మము కాపాడుకొనుటకై చర్మమును, తన ప్రాణమును కాపాడుకొనుటకై తనకు కలిగిన యావత్తును నరుడిచ్చునుగదా. ఇంకొక సారి నీవు చేయిచాపి అతని యెముకను అతని దేహమును మొత్తిన యెడల అతడు నీముఖము ఎదుటనే దూషించి నిన్ను విడిచిపోవుననెను" (యోబు2:4–5).అందుకుయెహోవా–అతడు నీవశమునన్నాడు. అతని ప్రాణమును మాత్రమునీవుముట్టవద్దనిసెలవిచ్చెను (యోబు 2:6).కాబట్టి అపవాది యోబును అరికాలు మొదలు కొని నడినెత్తి వరకు బాధగల కురుపులతో మొత్తెను. అతడు ఒళ్లు గోకుకొనుటకై చిల్ల పెంకుతీసికొని బూడిదెలో కూర్చొనెను (యోబు 2:7–8). అయినను యోబు దేవుని నిందించలేదు. గాని సాతాను అతనిపై మరియొక అస్త్రమును వినియోగించెను.

**యోబు 2:9–10**

"అతని భార్యవచ్చి, నీవు యింకను యథార్థత వదలక యుందువా? దేవుని దూషించి మరణము కమ్మనెను. అందుకతడు మూర్ఖురాలు మాటలాడునట్లు నీవు మాటలాడుచున్నావు; మనము దేవుని వలన మేలు అనుభవించుదుమా? కీడును మనము అనుభవింపతగదా అనెను, ఈ సంగతులలో ఏవిషయమందును యోబు నోటిమాటతో నైనను పాపము చేయలేదు" (యోబు 2:9–10).

సాతాను యోబు భార్యను అతని యొద్దనుండి తీసికొనిపోకుండా ఒక కారణము చొప్పున యుంచెను, ఆమె యెడల వాని ప్లాను వేరుగాయుండెను. దేవుని శపించునట్లు యోబును శోధించుటకు అపవాది అతని భార్యనే ఒక అస్త్రముగా వినియోగింపదలచెను. యోబు శరీరము కురుపులతో నిండి యున్నందున అతని బాధ అత్యధికముగా యుండెను (2:12). గురుతు పట్టలేనంతరీతిగా అతని శరీరము తయారయ్యెను అతని దేహము పురుగులతోను మంటి

పెల్లలతోను కప్పబడెను (7:5), మరియు వాసన కొట్టెను (19:17). అతనికి నెమ్మది లేకుండెను, నిద్రలేకుండెను (3:26).

కొన్ని గంటల వ్యవధిలో యోబు పిల్లలను తన సంపదనంతటిని కోల్పోయెను. ఒక్కదినమందే తాను తన పదిమంది బిడ్డలను గొప్పవిపత్తులో కోల్పోయెను. మరియు అతని భార్య తన భర్త యొక్క విపరీతమైన భరింపరాని బాధను చూస్తు అతనికి పరిచర్యచేయవలసి వచ్చెను. సంపదను, భర్త ఆరోగ్యాన్ని కోల్పోయి మానసిక క్షోభములో యోబు యొక్క భార్య వుండెను. ఇట్టి సందర్భములో సాతాను ఆమెను శోధించి తన భర్తకు వ్యతిరేకముగా ఆమెను ఉపయోగించెను. "దేవుని దూషించి, చనిపోరాదా?" యని ఆమె తన భర్తను హెచ్చరించెను. అయితే యోబు యొక్క విశ్వాసము బలమైనది. ఆమె తెలివి తక్కువతనాన్ని అతడు ప్రేమపూర్వకముగా గద్దించెను మనము దేవుని వలన మేలును మాత్రమే గాక కీడును కూడా పొంద డానికి ఇష్టపడాలని అతడామెకు వివరించెను. యోబుదేవుని దూషించ లేదు!

**యోబు 19:17**

"నాఊపిరి నాభార్యకు అసహ్యము నేను కనిన కుమారులకు నావాసన అసహ్యము"!

దేవుని దూషించుమని యోబుకు అతని భార్య సలహాయిచ్చిన తరువాత ఎంత సమయము గడిచినదోతెలియదు. దీనికి ముందున్న అధ్యాయాలలో యోబును "ఆదరించడానికి" వచ్చిన తనముగ్గురు మిత్రులకు తనకు మధ్య జరిగిన సంభాషణను మనం చూడగలము, వారి సంభాషణతుదకు ఆదరణవలె గాక నిందారోపణగా తయారయ్యెను. తనను ఆదరించడానికి వచ్చిన ముగ్గురు మిత్రులను గూర్చి యితరులను గూర్చి యోబు ఆరోపణ చేయడం 19వ అధ్యాయములో మనము చూడగలము వారిలో తన భార్య యొకతె. యోబు యొక్క శారీరక అవస్థవలన అతని ఊపిరి సయితము వాసన కొట్టుట వలన అతని భార్యకూడ దానిని అసహ్యించుకొనెను.

బహుశ యోబు తన భార్యను తన యొద్దకురమ్మని పిలిచి యుండ వచ్చును. తమ బిడ్డల జనన విషయములో వారి ప్రేమను గుర్తుచేసి యుండవచ్చును. మరియు వారు మరణించగా తాము పొందిన దు:ఖాన్ని ఆవేదనను వారెట్లు పంచుకొన్నారో తెలియజేసి యుండ వచ్చును ఆమె అతనికి పరిచర్య చేసినట్లు ఎక్కడా చెప్పబడలేనందున ఆమె అతనికి మాటలను పెడచెవిని పెట్టినదని మనం అనుకొన వచ్చును . అపవాది యోబు యొక్క భార్యను ఇంకా వినియోగించుచునే యున్నాడు. ఆమె శోధకురాలి నుండి హింసకు రాలిగా

మనకు తదుపరి అధ్యాయాల్లో కనబడును. యోబు గ్రంథము రెండ అధ్యాయములో ఆమె శోధకురాలై యుండగా, 19వ అధ్యాయ ములో హింసకురాలయ్యెను.

**యోబు 31:10**

"నాభార్య వేరొకని తిరుగలి విసరునుగాక ఇతరులు ఆమెను కూడుదురు గాక".

28వ అధ్యాయములో దేవుడు తనిపై కుమ్మరించిన అనేక దీవెనలను గూర్చి యోబు చెబుతాడు. యోబు యొక్క వివిధ బాధలు రోగములు 30వ అధ్యాయములో మనకు కనబడ్డాయి. తన నిరపరాధమును ధృవపరచుటకు యోబు 31వ అధ్యాయాన్ని వినియోగిస్తాడు. మరల తన బాధలు పాపమువలన కలిగినవి కావని వాదిస్తాడు.

తన నిరపరాధమును నిరూపించుట కొరకు, లేదా నేరమునకు శిక్షకు పాత్రుడనని చెప్పుటకు యోబు ఎంతైనా అవమానమును భరించుదునని చెప్పుటకు పైమాటలను చెప్పాడు. నేను అపరాధినైతేనాభార్యను వేరొకడు అవమానపరచునుగాక యని అతని ఉద్దేశ్యము. పూర్వము బానిసలైన స్త్రీలు తిరుగళ్లు విసరేవారు (న్యాయా 16:21; సంఖ్యా 11:8). యిది అత్యంత అవమానకరమైనపని. తన భార్యను తీవ్రముగా శిక్షించాలనేది అతని ఉద్దేశ్యము కాదు. గాని అత్యంత ఘనమైన రీతిగా జీవించిన తరువాత తాము దోషులైతే ఎంతటి అవమానమునైనా వారికి చేయవచ్చని అతని అభిప్రాయము. దేవుని దూషించుమని యోబుభార్య అతనికి సలహానిచ్చి శోధించినది. అతనిని ఆదరించలేనందున ఆమె అతని హింసకురాలయ్యింది. బిడ్డలు మరణించి, ఆస్థి అంతా కోల్పోయిన తరువాత ఆమె అతని ఆదరించనే లేదు. దీని యంతటిలోను యోబు తన భార్య యెడల ప్రేమను, దయనుకనుబరచెను.

**నేర్చుకొనదగిన సూత్రములు:**

**యోబు భార్య శోధకురాలు :**

సృష్టిజరిగిన నాటినుండి సాతనుడు చాలకుయుక్తి గల శోధకుడు. దేవుని బిడ్డలు పాపములో పడుటకు సాధనములుగా వాడుయితరులను వాడుకొనును. మంచి చెడ్డల తెలివినిచ్చు పండ్లను తినునట్లు వాడు హవ్వను మోసగించెను (ఆదికా. 3). అబ్రాహాము శారానుపాపముచేయుటకు ప్రోత్సహించెను. ఆమె అతని సోదరియని అతడు చెప్పుమనెను (ఆది.కా. 12:13; 20:13). తాము తమ పొలమును అమ్మిన వెలను గూర్చి పాపము చేయునట్లు అననీయ తన భార్యయైన సప్పీరాను ప్రోత్సహించెను. (అపొ.కా. 5:1-10). శోధన, పాపము ఆదినుండియే కలసి యున్నట్లగుపడుచున్నది. పాపము

చేయుటకు సాతాను వినియోగించిన అనేకులలో యోబు యొక్క భార్య ఒకతె.

ఆమె తన సమస్తమును పోగొట్టు కొనినది -తన ఆస్థితి, బిడ్డలను, సమాజములో స్థానమును పోగొట్టు కొనెను. ఒక విధంగా ఆమె తన భర్తతో "దేవుని దూషించి మరణము కమ్ము" అని ఆమె పలికెను. తనభర్తకు యోబు భార్య ఎందుకు అట్టి మాటలు చెప్పెను? యోబు యొక్క ముగ్గురు మిత్రుల వలె బహుశ యోబుఏదో పాపము చేసియుంటాడని ఆమె తలంచి యుండవచ్చును. దేవుని దూషించుట ద్వారా అతడు నీతి మంతునిగా నటించడం అంతమగునని ఆమె తలంచియుండ వచ్చును. నిజానికి ఒక మంచి భార్యతన భర్తకు అట్టిమాటలు పలుకుమని ఎందుకు చెప్పునో మనకు తెలియదు. గాని ఒకటిమాత్రం మనము నేర్చుకోవాలి - ఏచిన్న తరుణం దొరికినా పాపము చేయునట్లు అపవాది మనలను వాడు కొంటాడు.

బలహీన సమయంలో అపవాది యోబుభార్యను ఎట్లు ప్రేరేపించాడో, మన బలహీన ఘడియలలో మనపైబడుటకు అపవాది కనిపెట్టుచు యున్నాడు. "నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడి, మీవిరోధియైన అపవాది గర్జించు సింహము వలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1 పేతురు 5:9). మన తలంపులను, క్రియలను గూర్చి ఎల్లవేళలా జాగ్రత్తగా యుండాలి.

ఈలోకబాధలు మనలను దేవుని దగ్గరకు తీసికొని రా వచ్చును లేదా ఆయన నుండి దూరపరచ వచ్చును. ఇందు విషయమైన నిశ్చయాన్ని మనమే చేసికోవాలి, "శోధన సహించువాడు ధన్యుడు, అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవ కిరీటమును పొందును" (యాకోబు 1:12-13). "సాధారణముగా మనుష్యులకు కలుగుశోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగిన వాడు; మీరు సహింప గలిగి నంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు సహింప గలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1కొరింథీ 10:13). "భక్తులను శోధనలోనుండి తప్పించుకొనుటకును, దుర్నీతి పరులను ముఖ్యముగా మలినమైన దురాశకలిగి శరీరానుసారముగా నడుచుకొనుచు, ప్రభుత్వమును నిరాకరించుచు శిక్షలో ఉంచబడిన వారిని తీర్పు దినము వరకు కావలిలో ఉంచుటకును ప్రభువు సమర్థుడు" (2 పేతురు 2:9).

పాపము చేయుటకై ప్రోత్సహించు వారిని క్రైస్తవులు నిరాకరించగలరు. గాని

మన దగ్గిర బంధువులు, సన్నిహిత స్నేహితులే శోధకులైతే, మనము సులభముగా అపవాది యొక్క వలలో పడిపోతాము.

నీవు యోబు భార్య వాంటి దానవా? నీవు దేవుని బిడ్డలను శోధించుదానవా? సాతాను చేతిలో ఒక పరికరముగా వాడబడుచున్నావా?

**యోబు భార్య హింసకురాలు:**

ఇతరులకు బాధ, వేదన కలిగించువాడు హింసకుడవుతాడు. ఈ వేదన భౌతికం కావచ్చును లేదా మానసికం కావచ్చును. యోబుభార్య అతనికి శోధకురాలే కాకుండా, హింసకురాలు కూడాను. అతని యెడల ఆమెకు జాలి యేమిలేనందున యోబుకు మానసిక క్షోభ సంభవించెను (యోబు 19:17). ఆదరణ అవసరమయిన సమయంలో ఆమె ముఖము చాటేసింది. అతని విన్నపములను విననొల్లకున్నది.

ఈలోక వేదనలు అనుభవించు సమయంలో మనకుటుంబ సభ్యులు మనకు ఆదరణ నిచ్చువారు కావచ్చును లేదా యోబు భార్యవలె హింసించేవారు కావచ్చును. వారుకూడ బాధలననుభవించుటచే యితరులను ఆదరించలేని స్థితిలో ఒక్కోసారి వారు ఉండవచ్చును. బాధింప బడువారి యెడల క్రీస్తులాంటి స్వభావము మనము కలిగి యుంటే వారిని ఆదరించగలము. మనం ఒకరినొకరు ఆదరించుకోవాలి. "కాగా దేవుని చేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులునైన వారికి తగినట్లు మీరు జాలిగల మనస్సును దయాళుత్వమును వినయమును సాత్వికమును దీర్ఘశాంతమును ధరించుకొనుడి" (కొలస్స 3:12). దయగలవారు యితరులను ఆదరించుదురు (యోహాను 3:17).

నీవు యోబు భార్య లాంటి దానవా? నీ ప్రియులు బాధపడుచుండగా నీవువారిని సిగ్గుపరచుదువా? సాతాను యేసు ప్రభువును శోధించినప్పుడు, "సాతానా, నావెనుకకుపొమ్ము" అని ఆయన వానిని గద్దించారు (లూకా 4:8). అపవాదిని ఎదిరించుటలో క్రీస్తును అనుకరింతము. మరియు అక్కర గలవారికి ఆదరణను, ఆప్యాయతను అందించుదము.

**అవసానఘడియలలో యోబు భార్య ముఖము చాటేసింది:**

మనలో ప్రతివారు ఏదో ఒక సమయంలో విషాదాన్ని ఎదుర్కొన వలసి వచ్చును. అది మన జీవితంలో పాపము వలన కావచ్చును లేదా యితరుల జీవితంలోని పాపమువలన కావచ్చును. ఇట్టిసందర్భాలు మనలను శోధిస్తాయి. భార్య భర్తలు ఇట్టి సమయాల్లో కలిసి ఎదుర్కొనాలి, సహించాలి. యోబు భార్య ఈ పరీక్షలో విఫలమయ్యింది. తమ ఆస్థి,

సంపద, బిడ్డలను పోగొట్టుకొనినప్పుడు ఒకరికి ఇంకొకరికి సహాయకరంగా యుండుటకు బదులు యోబు భార్య అతని నుండి తొలగిపోయింది. "కనికరము చూపుతండ్రి, సమస్తమైన ఆదరణ అనుగ్రహించు దేవుడు, మన ప్రభువైన యేసు క్రీస్తు తండ్రియునైన దేవుడు స్తుతింపబడును గాక. దేవుడు మమ్మును ఏ ఆదరణతో ఆదరించుచున్నాడో ఆ ఆదరణతో ఎట్టి శ్రమలలో ఉన్న వారినైనను ఆదరించుటకు శక్తి గల వారమగునట్లు ఆయన మాశ్రమ అంతటిలోను మిమ్మును ఆదరించుచున్నాడు" (2 కొరింథీ 1:3-4).

ఆమె యొక్క ప్రవర్తనను బట్టి యోబు తన భార్యను ఎన్నడు ఖండించలేదు. ఆమె తన స్వభావమును మార్చుకోవాలని అతడు ప్రేమతో ఆమెకు తెలియజేసాడు. చివరకు యోబు పోగొట్టుకొనిన దాని నంతటిని దేవుడతనికి తిరిగి దయ చేసినట్లు యోబు గ్రంధము ఆఖరి అధ్యా యము చెప్పు చున్నది. అతని ఆస్థి రెంట్టింపాయెను. అతనికి మరియేడుగురు కుమారులును, ముగ్గురు కుమార్తెలును కలిగి దీవించబడెను (యోబు 42:10-17).

యోబు దంపతులు గొప్ప విపత్తుల నెదుర్కొనిరి. ఒకరు శక్తి కొరకు దేవుని హత్తుకొనిరి. యోబు యెడల మనము సానుభూతి కలిగి యుండినను, ఆమెను ఖండించకుండా యుండలేము ఏది ఏమైనా యోబు యొక్క భార్యను మనం ఎన్నడు అనుకరించరాదు. గాని అట్టిసందర్భాలలో మనం ఎట్లు ప్రవర్తింపరాదో నేర్చుకోగలము.

— బోనీ రష్మోర్

## దేవుని ప్రేమ, దాని పొడవు, వెడల్పు, లోతు
## (The Love of God, its Length, Breadth and Depth )

పరమందొక దేవుడున్నారు! ఆయన ఎట్లుంటారు? దేవుడు సర్వజ్ఞానియని, సర్వశక్తిమంతుడని, దీర్ఘశాంతుడని, ఎల్ల వేళలా యుండువాడని, పరిశుద్ధుడని, నీతిమంతుడని, యదార్థత, దయ గలవాడని నేర్చుకొని యున్నాము.

దేవుడు ప్రేమయై యున్నాడు. "దేవుడు ప్రేమా స్వరూపి, ప్రేమలేని వాడు దేవుని ఎరుగడు" అని 1యోహాను 4:8 చెప్పుచున్నది, నిమిత్తమాత్రులమైన మనము ఆయన ప్రేమను పూర్ణముగా వర్ణింపజాలము. అయితే ఎఫెసీ 3:18-19లో మనము ఇట్లు హెచ్చరింపబడి యున్నాము: "మీరు దేవుని సంపూర్ణ

త యందు పూర్ణులగునట్లుగా ప్రేమయందు వేరుపారి స్థిరపడి సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడవు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకు శక్తిగలవారు కావలెననియు ప్రార్థించు చున్నాను".

క్రీస్తు ద్వారా దేవుని ప్రేమ మానవ జ్ఞానమునకు మించినదే అయినను, దాని పొడుగు, వెడల్పు, లోతు, ఎత్తు, ఎంతో గ్రహించుకొనుటకు మనం ప్రయత్నించాలి.

**ప్రస్తుత పరిస్థితులను బట్టి దేవుని ప్రేమను అంచనా వేయలేము:**

మొదటిగా దేవుని ప్రేమ యొక్క పొడుగును తెలిసికొనుటకు ప్రయత్నించుదాం. మనం సాధారణంగా ప్రేమను ప్రస్తుతానికే అంచనా వేస్తాం. మన ప్రస్తుత స్థితిని బట్టి దేవుడు మనలను ప్రేమించుట లేదను కొంటాము. ఆయన మరచిపోయాడను కొంటాము. శ్రమలు, బాధలు, ఇక్కట్లు రోగము, మరణము వగయిరాలను బట్టి దేవుడు మనల్ని గూర్చి చింతించుట లేదను కొంటాము. మనం ప్రార్థిస్తాము గాని జవాబురానట్టున్నది, దేవుడు మౌనియై మనకు దు:ఖము సంభవించుటనే సమ్మతించుచున్నట్లగుపడ్తాది. పాపము అన్యాయము పాలించుచున్నట్లే అగుపడ్తాది. అంతా చీకటి మయంగా కనిపిస్తాది. మన విశ్వాసము నిరీక్షణ సన్నగిలుతాది. అయితే ఏది మంచికో, యేది కీడుకో మనం సరిగ్గా నిర్ధారించుకోలేమని మనం గుర్తుంచుకోవాలి.

**యోసేపు ఐగుప్తు బానిసత్వము మంచికే :**

యోసేపు తన సహోదరులచే ఐగుప్తు బానిసత్వమునకు అమ్మివేయబడిన రోజు అతనికి చాల చెడ్డ రోజువలె అగుపడెను. గాని నిజానికి అది అతని జీవితంలో చాల గొప్ప రోజు, చాల మంచి రోజు. ఏలయనగా అతడు ఐగుప్తునకు యేలిక అవుటకు అది మొదటి రోజు! అతడు అమ్మివేయబడినప్పుడు నిజంగా అతడు చాల ఏడ్చియుంటాడు. అతడు ప్రస్తుతాన్ని మాత్రమే చూడగలిగాడు. అయితే దేవుడు ఆది నుండి అంతము వరకు ఎరిగియుండి ఆయన గొప్పప్రేమ వలన యోసేపును సంరక్షించి, చివరి వరకు నడిపారు.

**సిలువపై క్రీస్తు మరణం మంచికే :**

ఇస్కరియోతు యూదాచే యేసు అప్పగింపబడిన రోజు, సిలువ వేయబడిన రోజు చాల చెడ్డదినముగా అగుపడింది. ఆరోజు మనం యెరూషలేములో ఉండియుంటే దేవుడు క్రీస్తును ఆదుర్మార్గుల చేతినుండి, కొరడా దెబ్బల నుండి, ఘోర హింసలనుండి విడిపించాలని ప్రార్థించియుండేవారము. సిలువ మీద వ్రేలాడుచు క్రీస్తు కన్ను లెత్తి తండ్రికి ప్రార్థన చేసిన దినం చాల చెడ్డదినము వలె

అగుపడుచున్నది. "నాదేవా, నాదేవా నన్నేల చేయి విడిచితివి?" యని క్రీస్తు సిలువపై నుండి అరచినప్పుడు, దేవుడా యన ముఖమును త్రిప్పెసుకొన్నట్ల గుపడినది. చివరకు సూర్యుడు కూడ చీకటి కమ్మాడు, భూమివణకింది, బండలు బ్రద్దలయ్యాయి. నిజానికి దేవుడు ప్రేమించలేనట్లు, పట్టించు కొననట్లు అగుపడింది, అయితే కటిక చీకటివలె యున్న ఆ ఘడియలే దేవుని ప్రేమ యొక్క గొప్ప నిదర్శనములు. మనుష్యుడు ప్రస్తుతాన్ని మాత్రమే ఎరిగియుండుటవలన అది అతనికి చెడ్డగా అగుపడింది. దేవుడు కూడ ఆనాడు ప్రస్తుతాన్ని గూర్చే ఆలోచించి యుంటే, నేడు మనకు రక్షణ సాధ్యము కాకపోవును.

**దు:ఖమువలన ప్రేమ పరిపూర్ణమగును.**

గనుక దు:ఖము, వేదన, శోధన, బాధలు, రోగము, మరణము వచ్చిన ప్పుడు నిరాశజెంది దేవుని ప్రేమబల హీనమైనదని తలంచవద్దు. దు:ఖములో ప్రేమ పరిపూర్ణమవుతాది గనుక మనం ప్రార్థించి కొనియాడుదాం. శోధనల ద్వారా విశ్వాసము బలపడ్తాది. శ్రమల వలన నిరీక్షణలో జ్ఞానము లభిస్తాది. "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువ బడినవారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగునని" పౌలు వలె మనం చెప్పగలగాలి (రోమా 8:28). "శాశ్వ తమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించు చున్నాను, గనుక విడువక నీయెడల కృప చూపుచున్నానని" యిర్మియా 31:3 చెప్పుచున్నది.

**దేవుని ప్రేమసార్వజనికమైనది గనుక వెడల్పైనది.**

ఇప్పుడు దేవుని ప్రేమ యొక్క వెడల్పును తెలిసికొందాము. అది సార్వ జనికమైనది గనుక చాల వెడల్పయినది. దేవుని ప్రేమను ఒకే ప్రాంతానికి, దేశానికి గుంపుకు మనం పరిమితిచేసి దానిని సంకుచితం చేస్తాము. దేవుడు ఏదో ఒక దేశమునకే పరిమితి అయిన వాడుకాడు. ఆయన తన ప్రేమను ఏదో ఒక జాతీయ పతాకానికి, జాతికి ప్రాంతానికి పరిమితి చేయ లేదు. కొన్ని దేశములు యుద్ధ సమయంలో దేవుడు వారికే సహాయం చేయాలని, తమ శత్రుదేశాన్ని నాశనం చేయాలనీ ప్రార్థిస్తారు. "ప్రభువా మాకు తోడుగా యుండుము" అని మనం ప్రార్థి స్తాము. గాని నిజానికి "ప్రభువా మేము నీతో యుండుటకు సహాయం చేయం డి"యని మనం ప్రార్థించాలి. దేవుడు పక్షపాతి కాడు. ఆయన యూదుడు కాదు. అమెరికా వాడు కాడు, రష్యావాడు గాని, జర్మనీ వాడు గాని, భారతీయుడు గాని కాదు, ఆయన చైనావాడు గాని, జపాను

వాడు గాని, ఇంగ్లాండు వాడు గాని కాదు ఆయన తన ప్రేమను తూర్పుదేశస్థులకు మాత్రమే గాని పశ్చి మదేశస్థులకు మాత్రమే గాని పరిమితం చేయలేదు. "దేవుడు లోకము నెంతో ప్రేమిం చెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాస ముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయన ననుగ్రహించెను" అని యోహాను 3:16 చెప్పుచున్నది. దేవుడు శ్వేత జాతీయుల దేవుడేకాదు, ఆయన నల్ల వారిని, తెల్లవారిని, అందరినీ సమానముగా ప్రేమించుచు న్నారు. ఆయన తన ప్రేమను ఏదో ఒక దేశానికే పరిమితిచేసి వారికి అన్ని సౌఖ్యాలు సదుపాయములు అనుగ్రహిం చేయడు. .... ఆయన కొందరిని నాయకు లుగాను, మరికొందరిని బానిస లుగాను చేయలేదు. ఆయన అందరినీ సమానంగానే చేసారు. దేవుని ప్రేమ విశాలమైనది, వెడల్పయినది.

**దేవుని ప్రేమ యొక్కలోతు**

దేవుని ప్రేమ యొక్క లోతును కూడ మనం గ్రహించుకోవాలని బైబిలు బోధించు చున్నది. దేవుని ప్రేమలోతైనది అంటే అది పైపైనే యున్న ప్రేమకాదు. దేవుడు మనకు సహాయం చేస్తారని మాత్రమే కొందరు తలస్తారు. ఆయన జాలిగలవాడు, సుల భంగా కరిగిపోతాడను కొంటారు. అయితే దేవుని ప్రేమ పైపైన మాత్రమే యుండేది కాదు. అది లోతైనది, యదార్థమైనది, బల మైనది.

**నీతిమంతుల యెడల దేవుని ప్రేమ ప్రత్యేక మైనది.**

నీతిమంతుల యెడల దేవుడు ప్రత్యేకమైన ప్రేమకలిగి యున్నారు. "యెహోవా నీతిమంతులను ప్రేమిం చువాడని" కీర్తన 146:8 చెప్పుచున్న ది". "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించు వాడు; నన్ను ప్రేమించువాడు నాతండ్రి వలన ప్రేమింపబడును, నేనును వానిని ప్రేమించి వానికి నన్ను కనబరచు కొందునని" యోహాను 14:21లో వ్రాయబడియున్నది. "ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును, అప్పుడు నాతండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకు వచ్చి వాని యొద్ద నివాసము చేతు ము" అని యేసు చెప్పెను (యోహా ను 14:23).

**దేవుడే మొదట మనలను ప్రేమించెను:**

మనము ఆయనను ప్రేమింపక ముందు దేవుడే మొదట మనలను ప్రేమించెనని మనం జ్ఞాపకముంచు కొనవలెను. "ఆయనే మొదట మనల ను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1 యోహాను 4:19). "మనము దేవుని ప్రేమించి తిమని కాదు, తానే

మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమ యున్నది" (1 యోహాను 4:10). 'శాశ్వతమైన ప్రేమతో నేనునిన్ను ప్రేమించుచున్నాను, గనుక విడువక నీయెడల కృప చూపుచున్నాను" అని ఆయన చెప్పుచున్నారు (యిర్మీయా 31:3). "మనము ఆయన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:6).

**పాపులమైనను దేవుడు మనలను ప్రేమించుచున్నాడు :**

జగత్తు పునాది వేయబడక మునుపే దేవుడు మన యెడల కలిగి యున్న నిత్య ప్రేమను బట్టి, మనము పాపులముగా యున్నా, ఆయన మన యెడల ప్రేమకలిగి యున్నారు. "నీప్రేమ చేత నా ప్రాణమును నాశనమను గోతి నుండి విడిపించితివి. నీ వీపు వెనుక తట్టు నాపాపములన్నియు పారవేసితివి" యని యెషయా 38:17 చెప్పుచున్నది. దేవుడు పాపమును ద్వేషించును. గాని పాపులమైనను మనలను ప్రేమించును "భక్తిహీనుల మార్గము యెహోవాకు హేయము, నీతి ననుసరించువానిని ఆయన ప్రేమించును" (సామెతలు 15:9). "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు భక్తి హీనుల కొరకు చనిపోయెను" (రోమా 5:8).

సిలువ మీద వ్రేలాడుచు క్రీస్తు సిలువపైనున్న దొంగను క్షమించుటలో నశించిన వారి యెడల, పాపములో యున్న వారి యెడల దేవునికున్న ప్రేమను ప్రత్యక్షముగాకనుబరిచారు. వ్యభిచారములో పట్టుబడిన స్త్రీని ఆయన క్షమించారు. మరియు ఆయనను ఘోరము గా హింసించి, సిలువ వేయుచున్న వారిని గూర్చి, తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని ప్రార్థించారు (లూకా 23:34).

**తప్పిపోయిన కుమారుని కథనము దేవుని ప్రేమకు సాదృశ్యమైనది.**

దేవుని ప్రేమ ఎంత లోతైనదో తెలియజేయుటకు యేసు తప్పిపోయిన కుమారుని కథనమును చెప్పారు (లూకా 15:11-32). తండ్రి యొక్క చిన్న కుమారుడు దుర్వ్యాపారము వలన తన ఆస్థినంత టిని పాడుచేసాడు. పందులను కాయుచు అతడు చివరకు బుద్ధి తెచ్చుకొన్నాడు. అతడు లేచి, తండ్రి యొద్దకు వచ్చి "తండ్రీ, నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపముచేసితిని, ఇక మీదట నీకుమారుడని అనిపించుకొనుటకు

యోగ్యుడనుకాను; నన్ను నీకూలి వారిలో ఒకనిగా పెట్టుకొనుమని" చెప్పుదునను కొన్నాడు (లూకా 15:18-19). అయితే వాడింకను దూరముగా యుండగానే తండ్రి వానిని చూచి, వానిమీద జాలిపడి పరుగెత్తుకొని పోయి వాని మెడమీద పడి ముద్దు పెట్టుకొనెను. వానికి పశస్తవస్త్రము కట్టెను, చేతికి ఉంగరము పెట్టి పాదములకు చెప్పులు తొడిగించి, క్రొవ్విన దూడను వధించి గొప్పవిందు చేసి సంతోషించెను. ఏలయనగా, "నాకుమారుడు చనిపోయి మరల బ్రదికెను, తప్పిపోయి దొరికెనని చెప్పెను " (లూకా 15:24).

తప్పిపోయిన కుమారుని యెడల తండ్రి కున్న ప్రేమ, పాపములో యున్న వారి యెడల దేవుని కున్న ప్రేమకు సాదృశ్యమై యున్నది, "మారు మనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతి మంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక్క పాపివిషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగునని" లూకా 15:7 చెప్పుచున్నది.

దేవుని ప్రేమ నిత్యముండునది గనుక అది పొడవైనది. అది సార్వజని కమైనది గనుక వెడల్పయినది. అది నశించిన వారిని వెదకునట్టిది గనుక లోతైనది అయినను దేవుని ప్రేమించు వారియెడల అది ప్రత్యేకమైనది.

**దేవుని ప్రేమయొక్క ఎత్తు**

దేవుని ప్రేమ యొక్క ఎత్తును ఎవరు అంచనా వేయగలరు? అపొ. పౌలు దీనికి ఇట్లు జవాబిచ్చుచున్నాడు. "దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవికంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు అని వ్రాయబడి యున్నది. మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలు పరచి యున్నాడు; ఆ యాత్మ అన్నిటిని దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు" (1కొరింథీ 2:9-10).

మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా
ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక
కొనసాగించుకోనండి. క్రొత్తవారిని చేర్పించండి.
- ఎడిటర్

# క్షమించుటకు సిద్ధముగా యున్న దేవుడు

దైవికంగా యుండుట యనగా దైవిక లక్షణములు కలిగియుండుటయని అర్థము. మనం అంతా దేవునివలె యుండలేము. గాని ఆయనవలె యుండుటకు ప్రయత్నము చేయాలి. మానవ ప్రవర్తనలో దైవిక తత్వము బయలు పరచబడును. మనం ఆయన ఆజ్ఞలు పాటించినపుడు ఆయన మనలో నివసించును గనుక యిదిసాధ్యమగును ( యోహాను 14:23).

యోహాను వ్రాసిన మొదటి పత్రిక 4వ అధ్యాయములో ప్రేమను గూర్చి అతడు చెప్పిన దానిని నేను యిష్టపడుదును. "ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు. మనమొకనినొకడు ప్రేమించిన యెడల దేవుడు మనయందు నిలిచియుండును. ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును" (1 యోహాను 4:12). దేవుడు ప్రేమించురీతిగా ప్రేమించుట ఉన్నతమైనది. ఆయన ప్రేమయొక్క లోతు ఎత్తులను గ్రహించుకొనాలంటే ఆయన గ్రంథమును జాగ్రత్తగా పఠించాలి.

ప్రవక్తయైన మీకా యెషయా యొక్క సమకాలికుడు. దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు ఆయనకులోబడనొల్లని ప్రజలైనందున వారి మీదకి రాబోయే కఠినశిక్షను గూర్చి ఈ యిద్దరుప్రవక్తలు ప్రవచించిరి. శిక్షింపబడిన తరువాత దేవుని ప్రజలు నూతన పరచుబడుటను గూర్చి మీకా గ్రంథము ఆఖరి అధ్యాయము చెప్పుచున్నది. దానిని మీకా ఇట్లు బయలుపర్చాడు.

"తన స్వాస్థ్యములో శేషించిన వారి దోషమును పరిహరించి, వారు చేసిన అత్రికమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతోసముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుటయందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు. ఆయన మరల మనయందు జాలిపడును, మన దోషములను అణిచివేయును, వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములో నీవు పడవేతువు" (మీకా 7: 18-19).

మన దేవుడు పాపములు క్షమించుటకు సిద్ధముగా యున్నందున నేను కృతజ్ఞుడను. నిజానికి మనకున్న నిరీక్షణ అదొక్కటియే. తదుపరి దేవుడు క్షమించురీతిగా క్షమించుట మనుకున్న ఒక దీవెన. ఆయన క్షమించునప్పుడు పాక్షికంగా క్షమించరు. ఆయన మన దోషములను అణచివేయును. మన పాపములన్నిటిని సముద్రపు అగాధములో పడవేయును.

దేవుని వలె క్షమించుటకు, ప్రేమించుటకు మనము ఎంతో నేర్చుకొనవలసి యున్నది. దైవికంగా యుండాలంటే గొప్ప సవాలుకాదా? దేవుడు క్షమించుటకు సిద్ధముగా యున్నారు.

\- జేక్ కార్టం

# మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు, తర్బీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

## Satya Vani

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

RNI Regd. No. 69973/98
Postal Regd. No AP/KD-02/2012-2014

TO

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004